# ఎవరో వస్తారని....!

-కన్నోజు లక్ష్మీకాంతం

రెండు గంటల క్రితం శ్రీచక్రపాణి గారుగా పిలువబడిన వ్యక్తి యిపుడు కీ.శే. చక్రపాణి గారు అని చెప్పడంలో... నిజంగా సృష్టి రహస్యం.... ఎంత గొప్పదో, అనిపిస్తుంది. ఈ రహస్యాన్ని తెలుసుకోవడానికే ఎందరో మహానుభావులు తమతమ జీవితాల్ని చాలా రకాలుగా భగవదర్పితం చేసుకున్నారు. అయితే రహస్యాన్ని తెలుసుకొన్నారో లేదో మాత్రం మనకు తెలియదు.

'జాతస్య మరణం ధృవం'- పుట్టిన ప్రతివాడూ గిట్టక మానదంటూ ఎవరో పెద్ద మనిషి తనకు తెలిసిన జీవిత సత్యాన్ని బోధిస్తున్నాడు, అందరూ యింతేలే... అన్నట్టుగా.

'అనుభవించాల్సిన వయసులోనే ఎన్ని కష్టాలొచ్చినా తట్టుకున్నాడు పాపం. అయినా, భగవంతుడికి దయ లేకపోయె గదా...!' ఎవరో పెద్దావిడ ముక్కు పిండుకుంటోంది.

'నిన్న సాయంకాలం లైబ్రరీలో కనిపించి చాలాసేపు మాట్లాడాడండీ! ఆయనతో మాట్లాడుతున్నంతసేపూ అసలు టైమే తెలియకపోయేది. హాస్య రచనల గురించే గాకుండా ఆధ్యాత్మికత గురించి మాట్లాడినా, నాటి సమాజం గురించే గాకుండా నేటి సమాజం గురించి మాట్లాడినా, సూక్తులు చెప్పినా, శృంగారం చెప్పినా, అబ్బో... ఎంత బాగా చెప్పేవాడండి. పాపం... నిన్న మాట్లాడిన వాడీరోజిలా... ప్చ్... ఏదీ చెప్పరాకుండా వుంది.' అప్పటికే ఆయన గొంతు పూడుకుపోయి మాట బయటికి రావట్లేదు.

పక్కింటి వాడేమైపోయినా తనకేమీ పట్టనట్టు ప్రేమలు కరువైన యీ నవీన తుచ్ఛ సమాజమని ఛీదరించుకుంటున్న మనకు యింకా చాలాచోట్ల ఆప్యాయత, అనురాగాలతో పాటు ఆర్ద్రత కూడా కనిపిస్తుందనడానికి కీ.శే. చక్రపాణి గారే ఉదాహరణ.

కాలనీ మొత్తం చక్రపాణి గారింటికే చేరుకుంది.

ఏడ్చీ, ఏడ్చీ సొమ్మసిల్లిపోయింది శారదాంబ.

ఆవిడ చుట్టూ చుట్టాలకన్నా యిరుగు పొరుగు వాళ్ళే ఎక్కువున్నారు.

గొప్పింటి నుంచి తనింటికొచ్చిన శారదాంబ సుఖపడలేదు గానీ, తృప్తిగా వుండేదని చాలాసార్లు చెప్పేవాడు చక్రపాణి.

ఆప్యాయంగా చూసే భర్త, ఆనందాన్ని పంచే పిల్లలుంటే, ఆ యిల్లాలికంతకన్నా యింకేం కావాలంటూ ఆవిడ గురించి చెప్పినట్టు ఆ నోటా ఆ నోటా తను విన్నప్పుడు ఆనందంగా కన్నీళ్లు వచ్చేవి ఆవిడకు.

కొండమీది కోతి కావాలని కోరే భార్యామణులకు అపురూపంగా తెచ్చిచ్చే అయ్యగార్లతో పాటు, తెచ్చివ్వలేని స్థితిలో వుండి కూడా ఆప్యాయంగా చూసుకునే శ్రీవార్లు కూడా వుంటారని చెప్పుకోవచ్చు.

కనీస కోర్కెలు కూడా తీర్చుకోలేని దంపతులు, పిల్లల భవిష్యత్తుకు మాత్రం తమ జీవితాల్ని త్యాగం చేస్తుంటారు కొందరు.

"ఎవరు ఎవరి కోసం బ్రతకాలి! ఎందుకోసం బ్రతకాలనేది'... సరియైన సమాధానం లేని తాటికాయంత ప్రశ్న. అయినా, అందరిదీ ప్రాకులాటే.

'పుత్రులే లేక పున్నామ నరకమే లేదంచు పుత్ర సంతానమునకై రోసిరోసి...' అంటూ నలుగురూ కూతుళ్లే వున్న తన స్నేహితుడు కోదండపాణికి ఛందస్సు లేని పద్యాలు వినిపిస్తూ, ప్రయత్నం పురుష లక్షణం... గదా... కొడుకు కొరకు మళ్లీ ట్రై చేయమంటూ తమాషాగా చెప్పేవాడే కానీ కొడుకైనా, కూతురైనా ఒకటేనంటూ స్టేజీ మీద గాకున్నా నలుగురూ కలిసిన చోట ఉపన్యాసం దంచేవాడు చక్రపాణి.

'సర్లేవోయ్. నీకు ముగ్గురూ అబ్బాయిలే కాబట్టి నువ్వెన్నైనా చెప్పగలవు మరి.' కోదండపాణితో పాటు ఎంతో మంది అన్నారామాట.

'అవును మరి...' మనసులోనే గర్వంగా చెప్పుకునేవాడు చక్రపాణి.

'ఎక్స్ట్రా అవసరాలకు ఎంత యిబ్బంది పడినా చదువుల దగ్గర మాత్రం 'సంపాదించేది వాళ్ళ కొరకే గదా...' అనేవాడు.

శారదాంబ మెడలో సన్నటి మంగళసూత్రం తాడుతో పాటు ఎప్పుడూ సాదాసీదా కట్టు చీరెలే తప్ప పట్టు చీరెలనేవి ఆమె ఎప్పుడో మరిచిపోయింది. అతి ముఖ్యమైన కార్యక్రమాలే తప్ప హాజరయ్యే కార్యక్రమాలు చాలా తక్కువే అని చెప్పొచ్చు.

చక్రపాణి గూడా కొత్త బట్టలు కుట్టించుకున్న సంగతి తనకు గుర్తే లేదన్నట్టుగా వుంటాడు.

ఉనికిలో పేదరికం కనిపించి భూమధ్య రేఖకు దిగువనే వున్నా పిల్లల విషయంలో మాత్రం బాగా శ్రద్ధ చూపేవాడు.

'ఎవరో వస్తారని... ఏదో చేస్తారని... ఎదురుచూసి మోసపోకుమా..." అంటూ పిల్లల గురించి ఆశపడుతూ వాళ్ళనంతగా చూడాల్సిన పనేమీ లేదంటూ ఎదురింటివాళ్ళు ఎద్దేవా చేసినపుడు కాసింత బాధపడినా, మనసు మీదికి మాత్రం తీసుకునేవాడు కాదు.

పరిస్థితులెలా వున్నా పిల్లలు మాత్రం చదువుల్లో ఫస్టనిపించుకున్నారు.

'అదృష్టవంతుడివోయ్' అన్నారు కొందరు.

'అమ్మాయిల్లేకపోవడం చాలా అదృష్టమన్నారు' మరికొందరు.

'అబ్బాయిలు రేపు అమెరికా వెళ్లి డాలర్లు పంపిస్తుంటే అప్పుడు గానీ మనవాడు అల్ట్రా మాడర్న్గా తయారై కార్లో నుంచి కాలే కింద పెట్టడు. అవునా...!' అంటూ క్యాంటీన్లో కూచుని బనాయిస్తున్నందుకు బాధతో పాటు సంతోషం కూడా కలిగేది.

కొడుకులు పుట్టగానే కాదు, వాళ్లు ప్రయోజకులైనప్పుడే తల్లిదండ్రుల కానందమని చెప్పె చక్రపాణికి, పిల్లలు బాగా చదివి ఉత్తములయ్యారని చాలా సంతోషించేవాడు.

పిల్లల్ని చూసుకొని బాగా మురిసిపోయే శారదాంబకు, పిల్లలకు పెళ్లిళ్లు కూడా అయిపోతే బాగుండుననిపించేది.

ఎత్తుకుని తినిపించే వయసు దాటిపోయినా, పిల్లలు పిల్లలే మరి.

'అమ్మాయిలైతే వయస్సు గురించి బాధపడాలి గానీ అబ్బాయిలకేం తొందరయ్యా సామీ...!' అన్నప్పుడు 'అవున్లే...' అనిపించినా పెళ్లిళ్ళయితేనే బావుండుననిపించేది. కానీ, పిల్లలేమో విదేశాల కెగిరిపోవాలనే ప్రయత్నాల్లో వున్నారు గానీ పెళ్లి మాటే ఎత్తడం లేదు.

మన దేశంలోనే వుండి సంపాదించుకోవచ్చు గదా...! అంటే వెటకారంగా నవ్వాడు పెద్దాడు.

మనస్సు కలుక్కుమంది. మాటను లక్ష్యపెడుతున్నట్టుగా లేదు.

ఎందుకో యీ మధ్య పిల్లల్లో కొంతకొంత కొత్త మార్పును గమనిస్తున్నారు పెద్దవాళ్లు.

అఫ్కోర్స్, విదేశాలకెళ్లే విషయాల్లో తనకేమీ తెలియదు. అయితే, చెప్పినా అర్థం చేసుకోలేనంత మట్టి బుర్రేం గాదు తనది.

పెద్దాడు ఆస్ట్రేలియాకు ప్రయాణం కడుతున్నాడు. వద్దని చెప్పినా తప్పకుండా పోవాలన్నాడు.

బ్యాంకు బ్యాలన్సూ, ప్రాపర్టీ దాఖలాలు వగైరా కావాలన్నాడు గానీ వచ్చే జీతం తిండీ, బట్టా, మందులూ, ఫీజులు వగైరాలకే సరిపోవడం లేదు.

చిన్నదైనా ఫరవాలేదు, స్వంత యిల్లు వుంటే బావుండునండీ... అంటూ శారదాంబ చాలాసార్లు అని కూడా 'ఇహ... కాదులే...' అని వూరుకుంది.

రేపు పిల్లలు తెచ్చే డబ్బుల్తో మాంచి యిల్లు కట్టుకుందామనే తృప్తి యిద్దరిలోనూ వుండిపోయింది.

ఆస్ట్రేలియాకు ప్రయాణం ఖాయమైంది.

వీసాలూ, స్టాంపులూ వగైరా వగైరాలకే ఎక్కడి డబ్బూ సరిపోవడం లేదు.

అక్కడ నేనెలాగూ సంపాదించి మీకు పంపిస్తాను గద నాన్నా... అన్నప్పుడు ఒళ్లు




పులకరించింది.

పి.ఎఫ్. పూర్తిగా లాగేశాడు. సి.సి.ఎస్. లోన్ తీసుకున్నాడు. ఇంకా... ఇంకా... తెచ్చాడు. అంతే. ఓ శుభ ముహూర్తాన విమానం ఆస్ట్రేలియా కెళ్లిపోయింది.

రెండో వాడికి ఎయిర్‌ఫోర్స్‌లో ఉద్యోగమొచ్చింది. కాశ్మీర్ బార్డర్లో పోస్టింగ్.

వద్దని చెప్పింది శారదాంబ.

జాబ్ రావడమే సంతోషం. ఎందుకు కాదంటావన్నారు మిత్రులు.

తనేమో ఫిఫ్టీ, ఫిఫ్టీలో వున్నాడు. 'బార్డర్‌లో చేసే ఉద్యోగాలకు భద్రతే లేదు మన దేశంలో...'

అని కొడుక్కు చెబితే– 'అలాంటిదేం లేదు నాన్నా... మంచి పోస్ట్ గదా... చాలా తక్కువ మందిని సెలక్ట్ చేశారు, అందులో నేనొకణ్ణి' అంటూ ఖచ్చితంగా పోవాలన్నట్టు చెప్పాడు.

'ఇతర రాష్ట్రాల గురించి మనకు తెలియదు గానీ మన రాష్ట్రం నుండీ, అందునా మన హైదరాబాద్ వాళ్లే చాలా మంది చనిపోతున్నారు గదా... అందుకని పోకుంటేనే బావుండునని' చెబితే 'ప్రతిసారీ నెగటివ్‌గా ఆలోచించి అనవసరంగా టెన్షన్ పడతారు డాడీ...' అంటూ సమాధానపరిచాడు వాడు.

'చక్కగా ఉద్యోగానికి వెళ్లే ముందు అవేం మాటలండీ' అంది శారదాంబ. పంపించాలని మనసులో లేదు. అయినా పెద్దల మాట వినే స్థాయి కన్నా పిల్లలు చాలా పైకెదిగిపోయారని మనసులోనే అనుకుంది.

పిల్లల్ని బాగా చదివించి పొరపాటు చేశామేమో అన్నాడు చక్రపాణి ఓరోజు భార్యామణితో.

'చదివించకపోయినా పొరపాటే కదండీ...' అంది ఆవిడ.

నిజమేననిపించింది.

రెండోవాడు బార్డర్లో జాయినయ్యాడు.

తన బాధ్యత, పై ఆఫీసర్ల విషయాలు, పని ఒత్తిడితో పాటు ప్రశాంతత గురించి లెటర్స్ రాస్తుంటాడు.

దేశాన్ని కాపాడే విషయంలో మన సైనికులు పడే శ్రమ గురించి ఎంత రాసినా తక్కువే అంటాడు.

కుటుంబాలను వదిలి వేల మైళ్ల దూరంలో, ఎముకలు కొరికే చలిలో వుంటూ దేశాన్ని కంటికి రెప్పలా కాపాడుతున్న వీళ్ల గురించి ప్రభుత్వం ఎన్ని సౌకర్యాలు కల్పిస్తున్నా తక్కువేనేమో అనిపిస్తుంది.

ఈ వాతావరణం చూడని వాళ్ళెవరికైనా బడ్జెట్లో దేశరక్షణకన్ని కోట్లు కేటాయించారని చదివి ఎందుకబ్బా...! అనుకుంటారు గానీ ఎంత ఖర్చుపెట్టినా తక్కువేనేమో మరి.

పక్కలో బల్లెం పెట్టుకుని పడుకుంటే జాగ్రత్త చాలా అవసరమే గద డాడీ...!

మన చుట్టూ మంచివాళ్ళే వున్నారనుకోడం పొరపాటేనేమో మరి. చుట్టూ వున్న దేశాలు గూడా అంతేకద డాడీ...!

ఏ దేశం వాడైనా ఆ దేశం కొరకు పోట్లాడితే బాగానే వుంటుందేమో కానీ పొరుగు దేశం వాడెలా నాశనం గావాలనే పోట్లాడతారేమో ననిపిస్తుంది.

సరే... అందర్నీ అడిగినట్టు చెప్పు మమ్మీ. మెస్‌కు టైమయింది. ఇంకోసారి మరిన్ని విషయాలు రాస్తానంటూ' నశేషంగా ముగిస్తుంటాడు లెటర్.

పెద్దాడు కొద్దిరోజులు ఫోన్ చేసినా ఆతర్వాత మానేశాడు.

అనుకోని అదృష్టంగా మూడోవాడికి అమెరికా ప్రయాణం తగిలింది. ఎలాగూ యిద్దరెళ్లిపోయారు గదా... మూడోవాడిని వద్దన్నాడు చక్రపాణి.

'వద్దు బిడ్డా!' అంది శారదాంబ.

'అక్కడున్న ఫ్రెండ్స్ సహకారంతో తనకీ అవకాశమొచ్చింది డాడీ! కాదనకండీ ప్లీజ్!' బ్రతిమలాడాడు.

'ఈ మధ్య అక్కడి పరిస్థితులేమీ బాగాలేవు కాబట్టి విదేశీయులందర్నీ పంపించేస్తున్నారట కదా! ఇంకా నీ కొడుకునేం పంపిస్తా'వన్నాడు మిత్రుడు.

నిజమేననిపించింది.

'అక్కడున్న ఇండియన్స్‌నీ, అందునా మన ఆంధ్రులందర్నీ వెనక్కి పంపిస్తున్నారట గదా, నువు ప్రోగ్రాం మార్చుకోవచ్చు గద బాబూ... అన్నాడు తను.

నాల్రోజులు అన్నం తినకుండానే అన్ని పనులూ చేసుకుంటున్నట్టనిపించింది.

పెద్దాడికింకా సంపాదన కుదర్లేదట. వాడూ కొంత డబ్బు పంపించమన్నాడు. వీడికీ డబ్బు బాగానే కావాలి.

ప్రయాణమెలాగూ ఆగడం లేదు.

'రెండు సంవత్సరాలు పంపించు. నీ పరిస్థితి గూడా మారుతుందన్నాడు' మరో మిత్రుడు.

చక్రపాణితో పాటు శారదాంబకు కూడా బుర్ర

పనిచేయడం లేదనిపించింది. 'ఎలాగూ వాళ్ళిద్దరిక్కడ లేనందుకు నువ్వైనా వుంటే బావుండునంది.'

'జస్ట్, రెండేళ్ళేనమ్మా' అంటూ చెప్పాడు.

ఎటూ తోచని పరిస్థితి.

రెండ్రోజులు బాగా ఆలోచించుకుని తీసుకున్న నిర్ణయం. వి.ఆర్.ఎస్. తప్ప వేరే మార్గం లేదు. తనకింకా ఎలాగూ ఐదు సంవత్సరాల సర్వీసే మిగిలింది. ఈ డబ్బుతో పెద్దాడి, చిన్నాడి సమస్యలు తీరిపోతాయేమోననిపించింది.

అంతే... అలాగే జరిగింది.

బాధను హృదయంలో దాచుకుని త్యాగం చేశాడు.

అబ్బాయి అమెరికా వెళ్ళిపోయాడు.

అప్పుడప్పుడు ఇంటర్‌నెట్‌లూ, ఫోన్‌లతోనే తల్లిదండ్రులూ, పిల్లలు. సరదాలూ, సంబరాలు స్వయంగా లేవు. పండగలూ, పబ్బాలొచ్చినా యిద్దరికీ ఏం చేసుకుంటాంలే అని అలాగే వుండడం... ప్చ్...! ఏమిటో అనిపిస్తోంది.

ఏది ఎలాగున్నా కాలం ఆగదని తెలుసు.

పెద్దాడికక్కడే కేరళ క్రిస్టియన్ అమ్మాయితో పెళ్లయిపోయిందని తెలిసింది. ఇక్కడ కాలేజీలో వున్నప్పుడే ఆ అమ్మాయితో లవ్ కుదిరిందనే సంగతి వాడి ఫ్రెండ్స్‌కు తెలుసు గానీ తమకా సంగతే తెలియదు. తెలిస్తే వద్దనే వాళ్ళమో, లేక సంతోషించి పెళ్లి చేసేవాళ్ళమో...! అది వేరే సంగతి. కానీ, చెప్పాలి గదా! ఉహు... చెప్పలేదు.

చాలా బాధపడ్డారు చక్రపాణి, శారదాంబలు.

దేశంలో కార్గిల్ యుద్ధ వాతావరణం. ఎవడు ఛస్తే మనకేమిటన్నట్లు సరుకుల ధరలు అప్పుడే పెరిగిపోయాయి. వేల మైళ్ల దూరంలో వున్న మనకీ యుద్ధం వార్తలు వింటుంటే వణుకు పుదుతున్నప్పుడు అక్కడ పోరాడుతున్న సైనికుల అవస్థలెలాంటివో మరి!

ఉన్నట్టుండి భయంకరమైన పిడుగు పడింది హైద్రాబాద్‌లో అదీ... చక్రపాణి యింట్లో.

చక్రపాణి రెండో అబ్బాయి సునీల్ వీరమరణం. మాతృదేశం కొరకు పోరాడుతూ ఎంతో మంది శత్రు సైనికులను హతమార్చి, తప్పని పరిస్థితిలో వీరాభిమన్యుడిలాగా అందులోనే కూరుకుపోయాడు.

టెలివిజన్ యింకేమేమో చెబుతోంది.

చక్రపాణి, శారదాంబలు గుండె ఆగినట్టయి కుప్పకూలిపోయారు.

ఇరుగుపొరుగు జనంతో ఇల్లంతా నిండిపోయింది. ప్రజలూ, ప్రభుత్వాధినేతలూ, విలేకర్లూ, ఫోటోగ్రాఫర్లూ వగైరా వగైరాలతో చక్రపాణి వుండే కాలనీ అంతా నిండిపోయింది. సి.ఎం. గారు సిటీలో లేనందున వారి సందేశాన్ని హోం మినిష్టరు గారు మోసుకొచ్చారు.

ఎవరెన్ని రకాలుగా చెప్పినా తమ సునీల్ మాత్రం రాడని ఖచ్చితంగా తెలిసింది.

విదేశాల నుండి యిద్దరబ్బాయిలు రావడానికి వీలుకావడం లేదని ఫోన్లో సంతాపం తెలియచేసి మరీ బాధపెట్టారు.

కోలుకోవడానికి కొంత టైం పట్టింది.

అమెరికాలో అబ్బాయి బెంగాల్ అమ్మాయిని పెళ్లి చేసుకున్నట్టు వాడే స్వయంగా ఫోన్ చేసి చెప్పాడు. మా అమ్మా నాన్నలకు చెప్పాలన్నా - తర్వాత చెప్పొచ్చులే అంటూ అమ్మాయి తల్లిదండ్రులు ఫోర్స్ చేసి పెళ్లి చేశారట.

మరోసారి హై టెన్షన్ తగిలినంత పనైంది

## మా ఊరి సూరీడు

సూర్యుడు-
ఎండకాలంలో
ఆరుగంటలలోపు
చలికాలంలో
అటుఇటుగా
ఉదయిస్తాడు-
కానీ
మా ఊరి నాయకుడు మాత్రం
ఏ కాలం అయినా కానీ
ఏ దశాబ్దం అయినా కానీ
ఖచ్చితంగా
ఐదేళ్లకోసారి
ఉద్భవిస్తాడు

-కోలపల్లి ఈశ్వర్

చక్రపాణికి. ఎందుకిలా అవుతోందని బుర్రంతా గీరుకున్నాడు. అర్థం గాలేదు.

స్వంత యిల్లు లేదు సరిగదా వున్న ఉద్యోగం కూడా పోగొట్టుకున్నాడు. రెక్కలొచ్చిన పక్షులేమో లేచిపోయాయి. నిస్సారంగా వున్న శారదాంబను చూస్తుంటే తన కేడుపొస్తోంది పాపం! పెళ్లయినప్పటి నుండీ ఆవిడకే సుఖమూ లేదు. పుణ్యం కొద్దీ పురుషుడని ఆవిడెలా నోచుకుందో గానీ తను దొరికాడు.

పోనీలే, బంగారం లాంటి ముగ్గురబ్బాయిలనుకుని తృప్తిపడితే కథ యిలా జరుగుతోందనిపించింది.

పిల్లలకెలాగూ పెళ్లిళ్లు కావాలి, అవి తమ చేతుల మీద కావాలనే ప్రతి తల్లిదండ్రులు చూస్తుంటారు గానీ యిప్పుడలా జరగలేదే...! ప్రేమించడం తప్పు కాకపోవచ్చు కానీ, ఆ విషయం పెద్దలకు చెప్పాలనే జ్ఞానం వుండాలి గదా... అనుకున్నాడు.

తనేరోజూ వాళ్ళకొచ్చే కట్నం గురించీ, వాళ్ళు తెచ్చే జీతం గురించీ ఆలోచించలేదు. పెళ్లి చేసుకుని పిల్లాపాపల్తో హాయిగా వుంటూ తమను ఆప్యాయంగా చూస్తే చాలనుకున్నాడు. కానీ, కథ అడ్డం తిరిగింది.

ఎవరో వస్తారని, వచ్చి తమనుద్ధరిస్తారని అనుకోడం పొరపాటే అనిపించింది.

ఉన్నచోట బ్రతకలేమని కాదు కాని మరోచోట బాగా బ్రతకొచ్చని వెళ్లిన వాళ్లు ఆప్యాయతా అనురాగాలకు దూరమేననిపిస్తుంది.

రేపు తల్లి తండ్రి చచ్చినా వీళ్లు రారని బాగా బాధపడ్డాడు. మానసికంగా చాలా కృంగిపోయిన చక్రపాణి ఏదో పోగొట్టుకున్నట్టుగా వుంటున్నాడు. స్వచ్ఛందంగా పదవిని కోల్పోయినప్పటికన్నా చాలా రెట్లు బాధపడుతున్నట్లుగా అనిపిస్తోంది.

టెన్షన్ వల్ల యీ మధ్య షుగర్ కూడా ఎక్కువైందన్నాడు డాక్టరు. మానసిక ప్రశాంతత లేకపోతే ప్రాబ్లమన్నాడు.

ఏది జరగాలో అది జరుగుతుంది. ఏది జరక్కూడదో అది జరగదంటూ శారదాంబ తనను బుజ్జగిస్తున్నప్పుడు కళ్లల్లో నీళ్లు తిరిగాయి.

ఆమె అగ్నిపర్వతాలు పొట్టన పెట్టుకున్న మహా సముద్రమనిపించింది. మానసిక వేదన ఎక్కువైనందుకే యిక తట్టుకోలేనట్టుగా యీరోజు శారదాంబను కూడా వదిలి తిరిగిరాని లోకానికెళ్లిపోయాడు. యిదిగో... యిలా... చక్రపాణి. అందుకే అందరూ గొల్లుమన్నారు.

ఫోన్లో తొందరగా దొరకని పిల్లలకు ఎలాగోలా సమాచారం అందించి తిరిగి వాళ్ల ఫోన్ కొరకు ఎదురుచూస్తూ కూచున్నారు.

పెద్దాడి నుండి ఫోన్. ఏడుస్తూ మాట్లాడుతున్నాడు.

ఇక్కడ శారదాంబ మాట్లాడే స్థితిలో లేదు. ఆమె తమ్ముడు మాట్లాడుతున్నాడు.

పదిహేను నిమిషాల తర్వాత తేలింది... అతడు రావడానికి వీలుకాదూ అని.

'ఎంత కఠినాత్ముడంటూ' అందరూ చెవులు కొరుక్కున్నారు.

అమెరికా నుండి ఫోన్.

మూణ్ణిముషాలు అబ్బాయి మాట్లాడితే, అమ్మాయేమో ఒక నిమిషం మాట్లాడింది. ఆతర్వాత ఆరు నిముషాల పాటు అమ్మాయి తండ్రి మాట్లాడుతూ 'మరో మూడు నెలల్లో మేము ఇండియాకు వచ్చేదుందండీ... అప్పుడెలాగూ మాతో పాటే మీ అబ్బాయిని గూడా తీసుకొస్తాం గదా... అదీ గాకుండా ఉద్యోగం దొరికి రెండు నెలలే కావస్తోంది కాబట్టి సెలవు కూడా దొరకడం కష్టం. అందుకని మరోలా భావించకుండా ఎలాగోలా కార్యక్రమాన్ని ముగించెయ్యండి' అంటూ ఫోన్ పెట్టేశాడు.

వార్త అక్కడి జనాలకందరికీ చేరింది.

ఇద్దరు కలిసి శారదాంబను పట్టుకుని ముందు నడిపిస్తుంటే కార్యక్రమమెలాగో అయిందనిపించారు.

చాలామంది కొడుకులను తిడుతుంటే కొందరేమో చక్రపాణిని కూడా తిట్టారు.

అయినా, ఎవరికోసం ఎవరు బ్రతుకుతున్నారో అర్థం గానప్పుడు ఎవరిని తిట్టి ఏం లాభమనిపిస్తుందీ... ఎవరో వస్తారని ఎదురు చూడ్డమెందుకనిపిస్తుంది. ■